# అమెరి'కులాసా' కథలు

## – వంగూరి చిట్టెన్ రాజు





## – 9 –

## నసరుసబుస కథ

సెప్టెంబర్ 23–24, 2017 తేదీలలో అమెరికా రాజధాని వాషింగ్టన్ లో 10వ అమెరికా తెలుగు సాహితీ సదస్సు మరియు మొట్ట మొదటి అమెరికా మహిళా రచయితల సాహిత్య సమ్మేళనం దిగ్విజయంగా జరిగింది. సుమారు 160 మంది ప్రతినిధులు, 30 సాహిత్య ప్రసంగాలు, పుస్తక విక్రయశాల వగైరాలతో రెండు రోజులు అందరం సాహిత్యానందం అనుభవించాం. అయితే అక్కడికి విమానాల్లో వెళ్ళడం, రావడం నాకు భలే చికాకులు వచ్చాయి. వెళ్ళేటప్పటి చికాకులు మధురవాణి.కామ్ లో వ్రాసుకున్నాను. వెనక్కి వచ్చేటప్పటి చికాకులు ఇక్కడ వ్రాసుకుంటున్నాను. చదువుకోండి.

ముందుగా నేను ఈ విమానాశ్రయ నిర్వాహకులకి, ట్రంపు గారికీ ఒక విలువైన, ఆచరణ యోగ్యమైన అద్భుతమైన సూచన ఇవ్వదల్చుకున్నాను. ఇది ఇప్పటిదాకా వాళ్ళకి ఎందుకు తట్టలేదో నాకు తెలియదు. అదేమిటంటే చెప్పుల విషయంలో వాళ్ళు హిందూ సిద్ధాంతాలని పాటించాలి. అనగా మనం గుడికో. ఎవరింటికి అయినా వెళ్ళినప్పుడు చెప్పులు బయట వదిలేసి వెళ్ళడం మన ఆచారం. సరిగ్గా అదే ఆచారం విమానాశ్రయాలలో పాటించాలి. అంటే విమానాశ్రయం లోపలి అడుగుపెట్టేటప్పుడు చెప్పులు, బూట్లూ అన్నీ పైన వదిలేసే రూల్ పెడితే, ఆ వెధవ సెక్యూరిటీ లైన్ లో అందరూ చెప్పులు తీసి ఆ బెల్టు మీద పెట్టేటప్పుడు జరిగే గందర గోళం, కొండొకచో రకరకాల దుర్వాసనలు నివారించవచ్చును. అలా పైన వదిలేసి చెప్పులని ఎవరికీ వారు వారు పెట్టెలు చెక్ ఇన్ చేసినట్టుగా ఏర్పాటు చెయ్యడం, లేదా పుస్తక విమానం వారే సామూహికంగా ఆ చెప్పులన్నీ వారే చెక్ ఇన్ చేసి, విమానం క్రిందికి దిగగానే ఆ బేగేజ్ క్లైమ్ దగ్గర పద్ధతి ప్రకారం పెడితే సులభంగా ఉంటుంది. అలా అని గుడిగుమ్మం దగ్గర వందల కొద్దీ చెప్పులు కలగా పులగం గా పడిఉండేలా విసిరేస్తే అది అమెరికన్ పద్ధతి అనిపించుకోదు. అసలు ఈ ఆలోచన నాకు ఎందుకు వచ్చిందే ఆ పుస్తక విమానం ప్రయాణీకులలో, ఆ మాట కొస్తే ఆ రోజు విమానాశ్రయం లో అడుగు పెట్టిన వారిలో బాతా చెప్పులు వేసుకున్నవాడిని నేనొక్కడినే. మిగిలిన దొరలందరూ పెద్ద గొప్పగా మామూలు బూట్లు, కౌబాయ్ బూట్లు వేసుకుని ఆ సెక్యూరిటీ లైన్ లో అమాయకంగా నుంచున్న నా పవిత్ర హిందూ పాదాలకి మొక్కవలసింది పోయి ఒకడి తరవాత ఒకడు...ఆఖరికి కొందరు దొరసానులు కూడా నిర్దాక్షిణ్యంగా తొక్కి..పుండు మీద కారం చల్లినట్టు సారీ మీద సారీలు చెప్పడం. అసలు ముందు నా కాలు తొక్కడం ఎందుకూ... తర్వాత సారీ ఎందుకూ అంట. నేను తెలుగులో కుయ్యో మొర్రో అనడం.వాళ్ళు ఇంగ్లీషు లో సారీ నాకు తట్టిన

ఈ బ్రిలియంట్ అవిడియాని సాహితీ సదస్సులో ఒక ఏకగ్రీవ తీర్మానంగా పెట్టాను కానీ, పచ్చడై పోయిన కాళ్ళు నావి కాబట్టి, సదస్సు ప్రతినిదులకి కించిత్తు నొప్పి కూడా లేదు కాబట్టి ఆ తీర్మానాని ఒకటే ఓటు పడి వీగిపోయింది.

ఈ అడ్డంకులన్నీ దాటుకుని, విమానం లోపలకి ప్రవేశించాను. ఈ సారి అదృష్టవశాత్తూ నాకు కిటికీ పక్కన సీటు వచ్చింది. కానీ అది దురదృష్టమే కాని ఏ మాత్రం అదృష్టం కాదని అరగంటలో తెలిసి పోయింది. ఎందుకంటే నా పక్క రెండు సీట్లలోను ఇద్దరు చైనీయులు చతికిల పడ్డారు. ఏదో బుద్ధిగా చతికిల పడితే బావుండును. కానీ ఇద్దరూ వాగుడు కాయలు. ఒకటే నస. అదేదో తెలుగు నసో, ఎంగిలి పీచూ అయితే సబ్జెక్ట్ ని బట్టి నేనూ నోరు చేసుకుందును.. కానీ ఆ చింగ్ చాంగ్ భాష మనకి బొత్తిగా అర్థం అవదే. పైగా కిటికీ పక్క కుర్చీ కాబట్టి పారిపోడానికి లేదు వాళ్ళ మూడు గంటల నసలో నాకు అర్థం అయిందల్లా ఆందులో ఒకడు డ్రింకులమ్మాయి తో "స్కాచ్" అని అరవడం. ఆ క్షణంలో నేను మరొక రహస్యం కనిపెట్టాను. అదేమిటంటే ఆ ఇద్దరిలో ఒకరు ఆడకూతురు. అనగా వాళ్లిద్దరూ మొగుడూ, పెళ్ళాలు అయిఉండనోపు అని తెలిసిమూడు గంటల సేపు విరామ రహితంగా ఆ నస కొనసాగడానికి సహేతుకమైన కారణం భార్యా భర్తల సంవాదం అనీ, ఏ దేశ భార్యా భర్తలని చూసినా ఏమున్నది మాటల తూటాలు తప్ప అని నిర్ధారణ అయింది. ఆ మాత్రం ఆడ గొంతుక గుర్తు పట్టలేదా అంత సేపూ అంటే ఈ మంగోలియన్ వారి భాషే అటువంటిది. ఎవరు మాట్లాడినా ఒక్కలాగే వినిపిస్తుంది నా ప్రాణాలకి. అంటే కాదు పట్టి పట్టి తీవ్రంగా శరీర శోభ చూస్తే కానీ ఆడా, మగా తేడా తెలియదు. అందరి ఎత్తు పల్లాలు, వెడల్పు ఒకటే. ముత్యాల ముగ్గులోలా "ఎంత మందిని గుర్తెట్టుకోను?.

మొత్తానికి వాషింగ్టన్ నుంచి విమానం అట్లాంటాలో దిగగానే నాకు ఈ నరక యాతన నుంచి విముక్తి కలిగింది. అక్కడి నుంచి హ్యూస్టన్ విమానంలో ఎట్టి పరిస్థితులలోనూ కిటికీ పక్కన కూర్చో కూడదు అని దృఢనిశ్చయంతో వరండా సీట్ ఎన్నుకున్నాను. ఈ సారి డ్రింకులమ్మాయితో కొంచెం పేచీ వచ్చింది. లేక పోతే ఏమిటి చెప్పండి. చెట్టంత కాదు కానీ మొక్కంత మొగాణ్ణి అక్కడ కూచుండగా ఆ అమ్మాయి నా పక్క సీటులో ఉన్న దొరలని ఆప్యాయంగా ఏం తాగుతారు అని పలకరించి, కాగితం మీద రాసుకుని నేనూ నోరు మెదపడానికి సిద్ధం అవుతుండగా ఆప్యాయత మాట దేవుడెరుగు..నా కేసి చూడనైనా చూడకుండా దాటుకు పోయింది. అప్పుడు ఆవిడ మొహం అటు వేపు పిష్ట భాగం నా వేపూ ఉండడంతో, గత్యంతరం లేక అత్యంత సున్నితంగా సాధ్యమైనంత వరకూ అందిన మేరకి నా చేతి వేలితో ఆవిడ మోకాలు ప్రాంతంలో తట్టాను. అది కేవలం దాహార్తుడనై ఉండడం వలననే కానీ ధూర్తుడను కానే కాదు కదా. ఈ విషయ పరిజ్ఞానం లేక ఆ సుందరాంగి తకీ మని వెనక్కి తిరిగి 'డోన్ట్ టచ్ మి' అని బుస కొట్టింది. నేను టచ్చ లేదు..నువ్వే నన్ను టప్పించి దాటుకు పోయావు. నా ఉనికిని చాటుకుని డ్రింకు కోరిక వెలిబుచ్చడం కోసం నా చూపుడు వేలుని వాడవలసి వచ్చింది అని వివరణ ఇచ్చి సారీ మంత్రం పదే పదే పఠించి వేసి ఆవిడ బుస ఆపాను. అయినా సరే, ఈ మూడు గంటల ప్రయాణమూ నాకు ఆవిడ రుసరుస లతోనే సరిపోయింది.

మొత్తానికి హ్యూస్టన్ వచ్చి పడగానే "ఎంత తగలేశావ్?" అనే మా క్వీన్ విక్టోరియా రుసరుస లాడుతూ నస మొదలయింది..తెలుగులో.. ఈ పరిస్థితిలో నేను ఆ డ్రింకులమ్మాయి ఉదంతం చెప్పిన యడల అవి బుసబుస స్థాయికి చేరడమే కాక కాటు కూడా వేయునేమో అని మూసుకుని ఇది వ్రాసుకున్నాను.

**COMMENTS**